సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

9705347494

నంబర్‌ను సంప్రదించండి

గెడ్డలు కనుమరుగు


కళ్లవానిపాలెంలో గ్రావెల్‌తో కప్పేసిన కోనేటి చెరువు

ఆక్రమణలో చెరువులు, గెడ్డలు

పొంచి ఉన్న ముంపు ముప్పు

పట్టించుకోని యంత్రాంగం

కొమ్మాది: ఆక్రమణకు కాదేది అనర్హం అన్నట్లుగా ఉంది నియోజకవర్గంలో పరిస్థితి. ఇప్పటి వరకు ప్రభుత్వ స్థలాలను, కొండలను తవ్వి ఆక్రమించుకుంటున్న అక్రమార్కుల చూపు ఇప్పుడు గెడ్డలపై, చెరువులపై పడింది. వారి స్వార్థ ప్రయోజనాల కోసం చెరువులను, గెడ్డలను రాయి, గ్రావెల్‌తో నింపి దర్జాగా ఆక్రమించేస్తున్నారు. దీనికి నిదర్శనమే విశాఖ రూరల్ పరిధి జీవీఎంసీ 8, 4 వార్డుల్లోని పలుప్రాంతాల్లో ఆక్రమణలకు గురవుతున్న గెడ్డలు, చెరువులు. గెడ్డలను కప్పేస్తే ముంపు ప్రమాదం పొంచి ఉందని, అది ఆ ప్రాంతాల మొత్తాన్ని ముంచేస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలను కాపాడండి మహాప్రభో అంటూ స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఆక్రమణదారుల ఆగడాలకు హద్దే లేకుండా పోతోంది.

కోనేటి చెరువును కప్పేశారు

జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ పరిధి కళ్లవానిపాలెంలో 149 సర్వే నంబర్‌లో 2 **ఎకరాల కోనేటి చెరువు ఆక్రమణకు గురై**ంది. రాత్రి సమయాల్లో ఈ ప్రాంతానికి చెందిన **ఇద్దరు నాయకుల అండదండలతో ఈ చెరువు**లో మట్టి, రాయిని వేసి పూర్తి స్థాయిలో కప్పేశారు. **దీంతో ప్రస్తుతం ఈ చె**రువు కనుమరుగైపోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు పడే సమయంలో ఈ ప్రాంతానికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వరద నీరు ఈ చెరువులోకి పోయేదని, ఇప్పుడు ఈ చెరువును కప్పివేయడంతో భవిష్యత్తులో ఏ చిన్న వరదకైనా మునిగిపోయే ప్రమాదం ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ చెరువులో ఉన్న మట్టి, ఇసుకను తొలగించి సంరక్షించేందుకు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు స్థానికులు అంటున్నారు.


స్వర్ణభారతి నగర్‌లో రోడ్డుకు ఆనుకుని ఉన్న గెడ్డను గ్రావెల్‌తో కప్పివేసిన దృశ్యం

బడ్డీల ఏర్పాటు కోసం..

రుషికొండ స్వర్ణ భారతినగర్‌లో సుద్దగెడ్డ ప్రస్తుతం ఆక్రమణకు గురైంది. సర్వే నంబరు 17లో ఉన్న ఈ గెడ్డను గ్రావెల్ వేసి మొత్తం పూడ్చివేశారు. ఓ నాయకుడి సహకారంతో ఈ గెడ్డ వెంబడి దుకాణాలు ఏర్పాటు చేద్దామనే ఆలోచనతో సుమారు 200 గజాల స్థలాన్ని చదును చేసేశారు.

గెడ్డపై కన్నేశారు

విశాఖ రూరల్ పరిధి పెదరుషికొండలో సర్వే నంబరు 28లో ఓ వ్యక్తి గెడ్డను మట్టితో కప్పివేశాడు. ఇది స్వర్ణభారతి నగర్ నుంచి పెదరుషికొండ మధ్య ఉన్న గెడ్డ. ఆయనకు ఉన్న కొంతమేర స్థలాన్ని ఆనుకుని ఉన్న ఈ గెడ్డను (300 గజాలు) కలిపేసుకుని ఓ షెడ్‌ను కూడా నిర్మించేసుకున్నాడు. దీని విలువ రూ. 4 కోట్ల పైమాటే. దీనిపై స్థానికులు సచివాలయాలకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

- అదేవిధంగా సర్వే నెంబర్ 100లో ఎండాడ రాజీవ్ స్వగృహ సమీపంలో ఉన్న గెడ్డను మట్టితో కప్పేశారు. దానిపైనా చర్యలు లేవు.

ఇలా కనిపించిన ప్రతి గెడ్డను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నా అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మేల్కొకుంటే ఈ గెడ్డలకు ఆనుకుని ఉన్న ప్రాంతాలన్నీ భవిష్యత్తులో ముంపునకు గురవడం తథ్యమని, అందరం భారీ మూల్యమే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.


పెద రుషికొండలో గెడ్డను పూడ్చివేసిన దృశ్యం

మట్టితో కప్పి.. ఆక్రమించి..

విశాఖ రూరల్ పరిధి పెద రుషికొండ సర్వే నంబరు 28లో గెడ్డను ఓ వ్యక్తి మట్టితో కప్పి ఆక్రమించుకున్నాడు. ఈ గెడ్డకు ఆనుకుని ఉన్న సర్వే నెంబరు 27లో అనేక ప్రైవేటు స్థలాలు ఉన్నాయి. అయితే, ఈ స్థలాలను చేరుకోవడానికి దారి లేక ఏకంగా గెడ్డను మట్టితో కప్పివేశారు. సుమారు ఇది 400 గజాల మేర ఉండగా దాని విలువ సుమారు రూ.3 కోట్లు. ఎండాడ, ఒమ్మివానిపాలెం, రుషికొండ మీదుగా ఈ గెడ్డలో ప్రవహించే మురుగు నీరుగా సముద్రంలో కలుస్తుంది. ఈ గెడ్డ కప్పివేయడంతో భవిష్యత్తు ప్రమాదకరమే అని స్థానికులు కలవరపడుతున్నారు.


పెదరుషికొండలో పూడ్చేసిన గెడ్డ

చర్యలు తీసుకుంటాం

విశాఖ రూరల్ పరిధిలో ఉన్న రుషికొండ, స్వర్ణభారతి నగర్, ఎండాడ ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన గెడ్డలను, భీమిలి పరిధి కాపులుప్పాడ, కళ్లవానిపాలెం ప్రాంతాల్లో ఆక్రమణకు గురైన గెడ్డలను, చెరువులను పూర్తి స్థాయిలో పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకుంటాం. అదే విధంగా గెడ్డలను అనధికారికంగా గ్రావెల్, మట్టితో కప్పి ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– సంగీత్‌మాథూర్, ఆర్డీవో

క్లుప్తంగా

'సచివాలయం తరలింపు సరికాదు'


జీరు వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి

భీమునిపట్నం: అందరికీ అనుకూలమైన ప్రాంతంలో ఉన్న సచివాలయాన్ని అధికారులు మరో ప్రాంతానికి తరలించారని, ఇది సరికాదని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇక్కడ చిల్లపేట సమీపంలో బొగ్గురోడ్డులో సచివాలయం ఉండేదని, దీనివల్ల ఈ చుట్టుపక్కల అనేక ప్రాంతాల వారికి ఎంతో సదుపాయంగా ఉండేదన్నారు. అయితే ఈ సచివాలయాన్ని తగరపువలస సంతపేట మీ సేవా భవనం వద్దకు తరలించారని, దీంతో అంతదూరం వెళ్లడం అందరికీ చాలా ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. ఈ సచివాలయాన్ని మళ్లీ బొగ్గురోడ్డు ప్రాంతంలోనే ఉండేవిధంగా అధికారులు, ఎమ్మెల్యే చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రావెల్ తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు సీజ్


సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

పద్మనాభం: మండలంలోని ఐనాడ చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లు, ఒక లారీ, ఒక జేసీబీని శుక్రవారం పట్టుకుని సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తుండటంతో వీటిని పట్టుకున్నట్టు పోలీసులు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్ దృష్టిలో పెట్టినట్టు తెలియజేశారు.

పత్రికలకు సమాచారం ఇచ్చాడనే నెపంతో వ్యక్తిపై దాడి


పీఎం పాలెం సీఐకు ఫిర్యాదు ఇస్తున్న బాధితుని బంధువులు

మధురవాడ: జీవీఎంసీ గిఫ్ట్ డీడ్‌లు ఇచ్చిన స్థలాల్లో కొందరు వ్యక్తులు అక్రమంగా దుకాణాలు నిర్మించి, లక్షల్లో అద్దెలు వసూలు చేస్తున్న వ్యవహారంపై ప్రధాన పత్రికల్లో కొద్ది రోజులుగా కథనాలు వెలువడుతున్న విషయం విదితమే. దీనికి సంబంధించిన సమాచారాన్ని పత్రికలకు ఇచ్చాడనే నెపంతో చంద్రంపాలేనికి చెందిన వరహాలు అనే వ్యక్తిపై ప్రసాద్, అప్పారావు, నానాజీ అనే వ్యక్తులు దాడి చేశారని పీఎం పాలెం సీఐ బాలకృష్ణకు బాధితుని బంధువులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులోని తన షాపులో ఉండగా శుక్రవారం ఉదయం సదరు వ్యక్తులు చొరబడి, దాడిచేసి గాయపరిచారని తెలిపారు. దీంతో బాధితుడిని వైద్యం నిమిత్తం గాయత్రి ఆస్పత్రికి తరలించినట్లు తెలియజేశారు. బాధితుడిపై ప్రత్యర్థులు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ప్రమాదకర విద్యుత్ వైర్లు తొలగించాలి



ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు, మహిళలు

తగరపువలస: ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను అధికారులు వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జోన్ కార్యదర్శి ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ యాతపేట వద్ద విద్యుత్ వైర్లు ఇళ్లపై వేలాడుతూ, చాలా ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవ్వ నర్సింగరావు, ఎస్.అప్పలనాయుడు, రేసు చిన్నారావు, రీసు నర్సింగరావు, బంగా రాజు, రమణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం


ఉత్తమ రైతులను సన్మానిస్తున్న సర్పంచ్ పావని

పద్మనాభం: ప్రకృతి సాగుపై రైతులు దృష్టి కేంద్రీకరించాలని పెంట గ్రామ సర్పంచ్ బోదన పావని సూచించారు. మండలంలోని పెంట గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమి, మనుషులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. వాతావరణం కాలుష్యం కాకుండా ఉంటుందన్నారు. ప్రస్తుతం రైతులు విచక్షణారహితంగా పురుగుల మందులు, రసాయన ఎరువులు వాడుతున్నారన్నారు. వీటికి బదులు నవధాన్యాల విత్తనాలు వేయాలన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ మహిళా రైతులు బోదన కృష్ణవేణి, కొత్తల సత్యవతిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎస్‌డీఏ అప్పలనాయుడు, డీఎంఎంటీ దుర్గారావు, స్థానిక నాయకుడు గొర్లె బంగారునాయుడు పాల్గొన్నారు.

అప్పలస్వామి కుటుంబానికి పరామర్శ


అప్పలస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న చిన్న శ్రీను

పద్మనాభం: మండలంలోని విలాస్కాన్‌పాలెంలో ఇటీవల మృతి చెందిన బాందేవపురం మాజీ ఎంపీటీసీ సభ్యుడు బాయి అప్పలస్వామి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) శుక్రవారం పరామర్శించారు. విలాస్కాన్‌పాలెంలోని అప్పలస్వామి ఇంటికి వెళ్లి, ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు బోని సన్యాసినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు ఉన్నారు.

'కర్మయోగి' కోర్సుపై ఉపాధ్యాయులకు అవగాహన


ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న హెచ్‌ఎం రవి

మధురవాడ: కర్మయోగి ఆన్‌లైన్ కోర్సులను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పూర్తి చేయాలని చంద్రంపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం రవి సూచించారు. ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్ పోర్టల్‌పై పాఠశాలలో ఉపాధ్యాయులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఉద్యోగుల విధి నిర్వహణలో నైపుణ్యాన్ని పెంచే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో శిక్షణనిస్తుందన్నారు. దీనిని అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు వినియోగించుకుని, తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. ప్రతి ఉద్యోగి ఇందులో రిజిస్ట్రేషన్ చేయించుకుని, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా లాగిన్ అవ్వాలన్నారు. కర్మయోగి పేరున గల ఈ కోర్సులో లాగిన్ అయ్యే విధానాన్ని పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మొబైల్ ఫోన్ల ద్వారా మొదటి కోర్సు అయిన కోడ్ ఆఫ్ కాండక్ట్ ఫర్ గవర్నమెంట్ ఎంప్లాయీస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


రామకృష్ణ (ఫైల్)

భీమునిపట్నం: తగరపువలస సమీపంలోని జీరుపేట వద్ద వ్యక్తి అదృశ్యంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. వివరాలివి.. జీరుపేటలో నివాసం ఉంటున్న బైరెడ్ల రామకృష్ణ (32) డిగ్రీ చదువుకున్నాడు. ఇతనికి కొంతకాలంగా మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అనేక ప్రాంతాల్లో వెదికినా ఫలితం లేకపోవడంతో, రామకృష్ణ తండ్రి బైరెడ్ల నారాయణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆనందపురం హైస్కూల్లో క్రీడాకోర్టుల ఏర్పాటు


క్రీడా కోర్టుల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న పీఈటీ తదితరులు

మధురవాడ: కేంద్ర ప్రభుత్వ పీఎం శ్రీ పథకానికి ఎంపికైన ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టుల ఏర్పాటు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 100మీటర్ల రన్నింగ్ ట్రాక్, కబడ్డీ కోర్టు, క్రికెట్ పిచ్, వాలీబాల్, షటిల్ కోర్టులతో పాటు క్రీడా మైదానం అభివృద్ధి పనులు చేపడుతున్నారు. అందులో భాగంగా స్పోర్ట్స్ కోర్టులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

కమ్ముకున్న మబ్బులు.. అన్నదాతల్లో గుబులు


మద్దిలో పోగుపెట్టి ఉంచిన ధాన్యం


కృష్ణాపురంలో ఎండ బెట్టిన మొక్కజొన్నలు

ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో అన్నదాతల గుండెల్లో గుబులు రేగుతోంది. మండలంలో రబీ సీజన్‌లో మొక్కజొన్న 593 హెక్టార్లు, వరి 218 హెక్టార్లలో వేశారు. కృష్ణాపురం, మద్ది, పద్మనాభం, తునిపాలెం, పాండ్రంగి, కురపల్లి గ్రామాల్లో రైతులు ఈ పంట వేశారు. పంట పక్వానికి రావడంతో విక్రయించడానికి రైతులు కోసి పొలాల్లో ఎండబెడుతున్నారు. రెండురోజులుగా ఆకాశం మేఘావృతం కావడంతో వర్షం కురుస్తుందేమోననే భయం వారిని వెంటాడుతోంది. పంటను కాపాడుకునేందుకు పొలాల్లో పరుగులు తీస్తున్నారు. ఎండబెట్టిన పంట దినుసుల వద్ద టార్పాలిన్లు సిద్ధం చేసి ఉంచుకున్నారు. మబ్బులు కమ్మిన వెంటనే టార్పాలిన్లు కప్పుతున్నారు. – పద్మనాభం


మద్దిలో ఎండబెట్టిన ధాన్యం, సమీపంలో టార్పాలిన్లు

భక్తిశ్రద్ధలతో 'గుడ్ ఫ్రైడే'


వుడా కాలనీ ట్రినిటీ చర్చిలో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్ ప్రసాదరావు

భీమునిపట్నం: భీమిలిలోని రోమన్ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చర్చి ఫాదర్ రెవరెండ్ వై.అల్ఫోన్స్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కొందరు సభ్యులు ఏసుక్రీస్తును శిలువ వేసే ఘట్టాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏసుక్రీస్తు శిలువను మోస్తు వెళ్లే సన్నివేశాన్ని పెద్ద బజారు, మెయిన్ రోడ్డు, చిన్న బజారు ప్రాంతాల్లో ప్రదర్శించారు. అనంతరం ప్రదర్శించిన శిలువ ఘట్టం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో చర్చి సంఘసభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రినిటీ చర్చిలో..

మధురవాడ: మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలోని ట్రినిటీ లూథరన్ చర్చిలో పాస్టర్ రెవరెండ్ ఎస్. ప్రసాదరావు, ఆర్‌జీకే కాలనీలో పాస్టర్ జిలానీ తదితరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దేవుని స్తుతిగీతాలు ఆకట్టుకున్నాయి. పాస్టర్ ప్రసాదరావు సందేశమిస్తూ ప్రభువైన ఏసుక్రీస్తు సర్వ మానవాళి సంక్షేమం కోసం శిలువనెక్కి పలికిన మాటలు వివరించారు. ప్రజలను పాప విముక్తులను చేయడం కోసం తాను రక్తం చిందించిన దేవుడు ఏసుక్రీస్తు అని తెలియజేశారు. ఆర్‌జీకే కాలనీ, బక్కన్నపాలెం తదితర చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.


ఏసుక్రీస్తు శిలువను మోస్తున్న దృశ్యం




ఏసుక్రీస్తును శిలువ వేస్తున్న ఘట్టాలు

మత్స్యకారుల ఎన్యుమరేషన్ పూర్తి


నిషేధ భృతి కోసం ఎన్యుమరేషన్ చేస్తున్న సిబ్బంది

మహారాణిపేట: చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నిషేధ భృతి కోసం శుక్రవారం ఎన్యుమరేషన్ పూర్తి చేశారు. జిల్లాలోని 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల్లో మత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది, సచివాలయ ఫిషరీస్ కార్యదర్శులు, సాగర్ మిత్రాలు సర్వేలు నిర్వహించారు. ఏటా వేట నిలుపుదల చేసిన తర్వాత ఎన్యుమరేషన్ నిర్వహించడం పరిపాటి. ఇందులో భాగంగా నిర్వహించిన ఈ గణనలో అన్ని రకాలకు చెందిన మొత్తం 1,197 బోట్లను, 12వేల మంది మత్స్యకారుల వివరాలు నమోదు చేశారు. బోట్లకు, మత్స్యకారులకు ఫొటోలు తీశారు. ప్రతీ మత్స్యకారుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, బోటు లైసెన్స్ జిరాక్స్ కాపీలను సచివాలయంలో గానీ మత్స్యశాఖ సిబ్బందికి గానీ ఇచ్చి వేట నిషేధ భృతి కోసం పేర్లు నమోదు చేసుకోవాలని జేడీ చంద్రశేఖర్ రెడ్డి వివరించారు.

కనకమహాలక్ష్మి దేవస్థానానికి సింహాచలం ఏఈవో బదిలీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న కె.రాజేంద్రకుమార్‌ని నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి తిరిగి పంపిస్తూ రాష్ట్ర దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. చందనోత్సవం ముందు ఈ వ్యవహారం జరగడం దేవస్థానంలో చర్చకు దారి తీసింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్‌ను మూడేళ్ల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విజయవాడ దేవస్థానానికి బదిలీ చేశారు. కొన్నిరోజులకు మెడికల్ పర్పస్‌పై రాజేంద్రకుమార్ నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానానికి డిప్యుటేషన్‌పై వచ్చారు. మళ్లీ కొన్ని రోజులకు రాజేంద్రకుమార్ వర్క్ ఎరేంజ్‌మెంట్ బేస్‌లో కనకమహాలక్ష్మి దేవస్థానం నుంచి సింహాచలం దేవస్థానానికి వచ్చారు. దీంతో రాజేంద్రకుమార్‌ని తిరిగి కనకమహాలక్ష్మీ దేవస్థానానికి ఏఈవోగా పంపిస్తూ ఇన్‌చార్జి కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా చందనోత్సవం ముందు ఈవ్యవహారం జరగడం దేవస్థానం వర్గాల్లో చర్చకు దారితీసింది. ఏఈవోగా విధులు నిర్వర్తిస్తున్న రాజేంద్రకుమార్ భూపరిరక్షణ విభాగం బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. భూముల వ్యవహారంలో ఆయన పనితీరుతో అనుసరిస్తున్న వ్యవహారశైలి కూడా బదిలీకి ఒక కారణంగా చెప్పుకుంటున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

భీమిలి

9912220753

Office mail : sakshiadvtvsp@gmail.com